క్లుప్తంగా

చదువుతో పాటు క్రీడలు అవసరం

ఎంపీడీవో నరేందర్‌రెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి

యాచారం: చదువుతో పాటు క్రీడలు అవసరమని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని యాచారం ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు ఆసక్తి కలిగిన క్రీడలను నేర్చుకుంటేనే మంచి గుర్తింపు వస్తుందన్నారు. నేటి క్రీడాకారులందరూ గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన వారేనని గుర్తు చేశారు. వివిధ పాఠశాలల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు పోటీలో పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మయ్యకు ఘన నివాళి

తలకొండపల్లి: చీపునుంతలకు చెందిన మాజీ సర్పంచ్ రఘుపతి తండ్రి లక్ష్మయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రఘుపతి, రఘురాములు, కుమార్, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహేష్ కుమార్ గౌడ్‌కు సత్కారం



శాలువా కప్పి అభినందిస్తున్న రమేశ్‌గౌడ్

ఆమనగల్లు: పీసీసీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన మహేష్ కుమార్ గౌడ్‌ను మంగళవారం మాడ్గుల మండలం బ్రహ్మణపల్లికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు జెల్ల రమేష్ గౌడ్ ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లోని మహేశ్ కుమార్ గౌడ్ నివాసంలో కలిసి రమేశ్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు.

హనుమాన్ ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దావ ప్రతాప్, మున్సిపాలిటీ కౌన్సిలర్ కమటం రాధమ్మ, స్థానిక నాయకులు వెంకటయ్య, దావ దనుంజయ, శ్రీపాల్, అనంతరాములు, యాదగిరి, రవికుమార్, రవీందర్, నర్సింహ, మహేశ్, శ్రీకాంత్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 2 లక్షల ప్రొసిడింగ్‌ను జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అందజేసినట్లు ఏపీఎం శ్రీదేవి తెలిపారు. మహిళా సమాఖ్య భవనంలో టాయిలెట్స్ లేకపోవడంతో గత మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. దీంతో టాయిలెట్స్ నిర్మాణానికి మంజూరైన నిధుల ప్రొసిడింగ్‌ను మంగళవారం ఉప్పల వెంకటేశ్ అందజేశారని ఆమె చెప్పారు.

'సీజనల్'పై అప్రమత్తంగా ఉండాలి

షాబాద్: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ ఆస్పత్రిలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులు దోమల ద్వారా వ్యాప్తి చెందుతూ ఉండడంతో ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో గల గుంతల్లో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తుండడంతో వాతావరణంలో మార్పులతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన చెందకుండా వైద్యులను సంప్రదించాలని, ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు.

పీసీసీ అధ్యక్షుడికి సన్మానం

మొయినాబాద్‌రూరల్: పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మండలంలోని గౌడ కుల సంఘాల సభ్యులు ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంగళవారం గౌడ సంఘం మండల అధ్యక్షుడు అంజయ్యగౌడ్ ఆధ్వర్యంలో గౌడ కులాల సభ్యులతో కలిసి పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గౌడ కులాల అభివృద్ధికి అందరం కృషి చేద్దామని అధ్యక్షుడు తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

త్రిబుల్ ఆర్ గుబుల్!

- ముమ్మరంగా కొనసాగుతున్న సర్వే
- మండలంలోని పలు గ్రామాల్లో మార్కింగ్
- ఆందోళనలో రైతులు



కర్కాస్ తండాలో త్రిబుల్ ఆర్ మార్కింగ్‌ను చూస్తున్న రైతులు

తలకొండపల్లి: రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) దక్షిణ భాగం నిర్మాణ పనులకు సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. రోడ్డు మ్యాపును అనుసరించి ఓ ప్రైవేట్ కంపెనీ నిర్వాహకులు మార్కింగ్ చేస్తున్నారు. ఈ త్రిబుల్ ఆర్ రహదారి నల్గొండ జిల్లా నుంచి ప్రారంభమై ఆమనగల్లు మండలం చింతలపల్లి మీదుగా గౌరిపల్లి, ఖానాపూర్, కర్కాస్ తండా, బద్నాపూర్ శివారు ప్రాంతాల్లోని పొలాల మీదుగా కేశంపేట్ మండలం నిర్దవెల్లి, కాకునూర్, గ్రామాలతో పాటు, షాద్‌నగర్ మీదుగా వెళ్తుంది. సంబంధిత సర్వే కంపెనీ మార్కింగ్ చేయడంతో ఆ గ్రామాల ప్రజల గుండెల్లో గుబుల్ పెరుగుతోంది. మండలంలోని గౌరిపల్లి, ఖానాపూర్, కర్కాస్ తండా, బద్నాపూర్ గ్రామాల వ్యవసాయ పొలాల్లో త్రిబుల్ ఆర్ మార్కింగ్ చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు దీని గురించే తీవ్రంగా చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా మార్కింగ్ చేసిన పొలాల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తమకున్న రెండు, మూడు ఎకరాల పొలం పోతుండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎలా బతకాలని కొందరు రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. తమ పొలాల మీదుగా త్రిబుల్ ఆర్ చేపడితే, ఉన్న జీవనాధారం కాస్త దూరమవుతుందని అన్నదాతలు కన్నీరు మున్నీరవుతున్నారు. మండలంలో త్రిబుల్ ఆర్ రహదారికి తీసుకుంటున్న పొలాల ధర సుమారు ఎకరం రూ. 80 లక్షల నుంచి రూ. కోటి వరకూ పలుకుతుంది. అలాంటప్పుడు తమ పొలాల నుంచి త్రిబుల్ నిర్మాణం చేపడితే ప్రభుత్వం అంత ధర చెల్లిస్తుందో లేదోనని కొందరు రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా త్రిబుల్ ఆర్ మార్కింగ్ రైతుల మొఖాల్లో ఆనందం కనిపించడం లేదు.

భూములకు డిమాండ్...

మండలంలోని ఆయా గ్రామాల మీదుగా త్రిబుల్ ఆర్ నిర్మాణం చేపడుతుండడంతో భూముల ధరలు అమాంతం పెరిగి రియల్ వ్యాపారం పుంజుకోనుంది. ఈ విషయంలో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణానికి సంబంధించి మార్కింగ్ చేసిన రైతులకు నష్టాలు సంభవించగా, రియల్ వ్యాపారులు మాత్రం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మార్కింగ్ చేసిన సమీప పొలాల రైతులు సంతోషంతో మునిగి తేలుతున్నారు. భవిష్యత్‌లో తమ పొలాలకు అధిక ధర పలకడమే కాకా డిమాండ్ పెరగనుందని చెప్పుకుంటున్నారు. ప్రస్తుత ధర ఎకరం పొలానికి రూ. కోటి ఉంటే, రాబోవు రోజుల్లో అదే పొలానికి రూ. రెండు నుంచి రూ. 5 కోట్లకు పెరగొచ్చని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భూమి ఇప్పించాలి



నాకు 30 గుంటల పొలం ఉంది. ఆ పొలం నుంచి త్రిబుల్ ఆర్ నిర్మాణం చేయనున్నట్లు మార్కింగ్ వేశారు. ఉన్న భూమి పోతే ఏ పని చేసుకొని బ్రతకాలి. ప్రస్తుతం వ్యవసాయమే జీవనాధారంగా ఉంది. కాబట్టి రహదారి నిర్మాణానికి ఎంత భూమి పోతే అంతే విలువ గల భూమిని మరోచోట ఇప్పించాలి.

\- తిర్మణి మల్లేశ్, రైతు, జంగారెడ్డిపల్లి

రైతులకు మేలు చేయాలి



భూములు కోల్పోయి జీవనోపాధి కోల్పోతున్నాం. త్రిబుల్ ఆర్ నిర్మాణంతో నాకున్న 6 ఎకరాల్లో అర ఎకరం పోతుంది. మార్కెట్లో ఎకరా భూమి రూ. కోటి పలుకుతుంది. రైతుల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకొని మేలు చేయాలి

\- శ్రీనివాస్, రైతు, జంగారెడ్డిపల్లి

భూమికి.. భూమి పరిహారం..



త్రిబుల్ ఆర్ నిర్మాణం మా పాలిట శాపంగా మారింది. నాకున్న 30 గుంటల భూమి త్రిబుల్ ఆర్ నిర్మాణంలో పోతుంది. దీంతో భూమి కోల్పోయి ఎలా బ్రతకాలి. జీవనోపాధి ప్రశ్నార్థకం కానుంది. బ్రతుకు దెరువు వెతుక్కోవాల్సిన పరిస్థితి దాపురించింది. మార్కెట్‌లో ఎకరా భూమి సుమారు రూ. కోటి పలుకుతుంది. ప్రభుత్వం భూమి కోల్పోయే వారికి భూమి పరిహారంగా ఇస్తే బాగుంటుంది.

\- యాదయ్య గౌడ్, రైతు, జంగారెడ్డిపల్లి

భౌతిక శాస్త్రంలో వంశీబాబుకు డాక్టరేట్



వంశీబాబు

ఇబ్రహీంపట్నం: భౌతిక శాస్త్ర విభాగంలో చేసిన పరిశోధనలకుగాను ఇబ్రహీంపట్నానికి చెందిన కొంద్రు వంశీబాబుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. భౌతిక శాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి ఉపేందర్ పర్యవేక్షణలో 'రోల్ ఆఫ్ అల్కలీ మెటలాక్సైడ్ ఆన్ స్ట్రక్చర్ డిపెండెంట్ ప్రాపర్టీస్ ఆఫ్ బోరో-టెల్యూరైట్ గ్లాసెస్' అనే అంశంపై పరిశోధనలు చేశారు. వాటిని పరిశీలించి ఉస్మానియా విశ్వవిద్యాలయం వంశీబాబుకు డాక్టరేట్ ప్రకటించింది. త్వరలో నిర్వహించనున్న కార్యక్రమంలో గవర్నర్ డాక్టరేట్ అందజేయనున్నారు. ఈ సందర్భంగా వంశీబాబు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి, గవర్నమెంట్ సిటీ కాలేజీలో డిగ్రీ, నిజాం కళాశాలలో పీజీ పూర్తి చేశానన్నారు. తన తల్లిదండ్రుల ఆశీస్సులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో గౌరవ డాక్టరేట్ సాధించానన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

ఇబ్రహీంపట్నం: స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠంలో నిర్వహించనున్నట్లు స్థానిక ప్రభుత్వ పాఠశాల పీఈటీ సుశీల తెలిపారు. అండర్ 14 విద్యార్థులకు బుధవార, అండర్ 17 వారికి గురువారం పోటీలు నిర్వహిస్తామని చెప్పారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- తొర్రూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తనిఖీ



తుర్కయంజాల్: విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన పురపాలక సంఘం పరిధి తొర్రూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలువురు విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తరగతి గదులు, ఉపాధ్యాయుల కొరత గురించి డీఈఓతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, పాఠశాల పరిశుభ్రత గురించి మున్సిపల్ కమిషనర్ కె. అమరేందర్ రెడ్డికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నక్క శివ లింగం గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తలకొండపలిలో..

తలకొండపలి: తాజా కూరగాయలతో వండిన ఆహార పదార్థాలను విద్యార్థులకు వడ్డించాలని డాక్టర్ స్నేహ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌తో పాటు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, తాగు నీరు, భోజన మెనూ వివరాలు, డైనింగ్ హాల్, వంట గది, సామగ్రి, ఆహార పదార్థాలు, కూరగాయలు, తదితర వాటిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కుళ్లిన, పాడైన, కూరగాయలను వండొద్దన్నారు. తాజా కూరగాయలతో వండిన ఆహార పదార్థాలనే వడ్డించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ యాదమ్మ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆహారపదార్థాలను తనిఖీ చేస్తున్న డాక్టర్ స్నేహ

నిధులు మంజూరు చేయాలని వినతి

తలకొండపల్లి: మండల పరిధిలోని ఉమ్మడి పడకల్ గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు తెగాయని, కుంటలు, లీక్ అయ్యాయని, తూంలు, అలుగులకు మరమ్మతులు చేయించడానికి నిధులు మంజూరు చేయాలని ఉమ్మడి గ్రామ పంచాయతీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పడకల్ ఉమ్మడి గ్రామ పంచాయతీ పరిధిలో మహ్మద్‌ఖాన్ చెరువు, వీరన్నపల్లి చెరువు, పెద్దరాని చెరువు, కార్‌పోర్ చెరువు, పందోని కుంట, పెద్ద చెరువుల కట్టలు తెగి, తూంలు లీక్‌అయ్యాయని, అలుగులు దెబ్బతిన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనికి ఎమ్మెల్యే స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత, శతాబ్దిటౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ రమేశ్, మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలం యాదవ్, ఐలేష్, తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం అందజేయాలి

మాడ్గుల: కల్వకుర్తి ఎత్తిపోతల డి-82 కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలని వివిధ గ్రామల రైతులు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి నివాసంలో మంగళవారం పలువురు కాంగ్రెస్ నాయకులు, రైతులు కలిసి వినతి పత్రం అందజేశారు. కాలువ నిర్మాణంలో నాగిళ్ల, అప్పరెడ్డి పల్లి, దోడ్లపహడ్ తదితర గ్రామల రైతులు భూములు కోల్పోయమన్నారు. కాలువ నిర్మించి ఏండ్లు గడుస్తున్నా ఇంకా పరిహారం అందలేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొండల్ రెడ్డి, మిద్దె రాములు, జంగయ్య, మల్లేశ్, కృష్ణరెడ్డి, వెంకట్ రెడ్డి, పర్వతాలు పాల్గొన్నారు.



మాడ్గుల: వినతి పత్రం అందజేస్తున్న రైతులు, కాంగ్రెస్ నాయకులు

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

తలకొండపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా జెడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యుడు యండీ ముజీబుర్ రెహ్మాన్ పేర్కొన్నారు. అంతారంలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, డాక్టర్ అఖిల్, డాక్టర్ అనిల్‌ల, ఆమనగల్లు లయన్స్ క్లబ్, హైదరాబాద్ కామినేని ఆస్పత్రిల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం 189 మంది రోగులకు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, వైరల్ ఫీవర్, తదితర తాత్కాలిక వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ముజీబుర్ రెహ్మాన్ మాట్లాడుతూ కలుషిత నీరు నివారణకు క్లోరినేషన్ చేయాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటయ్య, రాములు, శ్రీను, చంద్రయ్య, నరేష్ గౌడ్, శ్రీధర్, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

భూములు నష్టపోకుండా చూడండి



మార్కింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణంలో మేడిగడ్డతండా, గుడితండాలలోని భూములు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని గిరిజనులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణం కోసం ఇటీవల సర్వే చేసి గుర్తులు వేశారు. మంగళవారం గుడితండాలో ఆర్‌ఆర్‌ఆర్ సంబంధించిన మార్కింగ్‌లను గిరిజనులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజనులు ఎమ్మెల్యేతో తమ సమస్యలు చెప్పుకొన్నారు. తమకు ఉన్న కొద్దిపాటి భూములు రోడ్డు నిర్మాణంలో కోల్పోతే తాము ఎలా బతకాలని ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. తమ భూములు నష్టపోకుండా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేతో కోరారు.

బాధిత కుటుంబానికి సాయం



కడ్తాల్: ఆర్థిక సాయం చేసిన శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన రాజయ్య మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మాజీ కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, బోసు వెంకటేశ్, వడ్డెరాజు, క్యామ రాజేశ్, శేఖర్, మహేశ్, రాఘవేందర్, శివలింగం, హరీశ్, నరేశ్, దయాకర్, శ్రీశైలం, శంకర్, యాదగిరి పాల్గొన్నారు.



అబ్దుల్లాపూర్‌మెట్: మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సభ్యుడు, లష్కర్‌గూడ గ్రామానికి చెందిన కొండూరి కిషన్ జులైలో మృతి చెందడంతో సహకార సంఘం తరపున మృతుడి కుటుంబ సభ్యులకు సంఘం కార్యాలయంలో చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ రూ. 15వేలు ఆర్థిక సాయం మంగళవారం అందజేశారు. డైరెక్టర్లు బిజిలీ బాలనర్సింహ, ఇటుకల మహేందర్‌రెడ్డి, మేకల రాములు, ఇన్‌చార్జి మేనేజర్ రాకేష్‌గౌడ్ పాల్గొన్నారు.



తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిలో..



యాచారం: నివాళులర్పిస్తున్న రజక సంఘం మండల అధ్యక్షుడు దశరథ తదితరులు

పేదల కోసం పోరాడిన వీరవనిత ఐలమ్మ

నియోజకవర్గ పరిధిలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో, రజక సంఘం నాయకులు, రాజకీయ నాయకులు ఐలమ్మ విగ్రహం, చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. చాకలి ఐలమ్మ తొలితరం, భూ పోరాట ఉద్యమ నాయకురాలని, భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడిన వీరమాత అని గుర్తు చేసుకున్నారు.



కడ్తాల్: నివాళులర్పిస్తున్న నాయకులు



మంచాల: ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు




మాడ్గుల: చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇర్విన్ గ్రామస్థులు



ఇబ్రహీంపట్నం: ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

కొనసాగుతున్న వినాయక పూజలు



ఇబ్రహీంపట్నం: గౌడ బస్తీ పూజలో భక్తులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని గౌడ బస్తీలో సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడికి దూపదీప నైవేద్యాలతో భక్తులు పూజలు చేస్తున్నారు. **ఆమనగల్లు:** పట్టణంలో నవ చైతన్య కాలనీలో గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక పూజలు కొనసాగుతున్నాయి. ఈ పూజలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కడ్తాల్: మండల పరిధిలోని గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.



ఆమనగుల్లు: పూజలో గోలి శ్రీనివాస్ రెడ్డి, గంప వెంకటేశ్ గుప్తా